ఓపెన్‌జిమ్‌కు ఆదరణేది?



జడ్చర్ల పద్మావతి కాలనీలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్

- విరిగిన పరికరాలు
- ఊడిన విడిభాగాలు
- పట్టించుకోని అధికారులు

జడ్చర్ల: ప్రజారోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ బహిరంగ ప్రదేశాలు, పార్కులలో బీఆర్‌ఎస్ హయాంలో ప్రపంచ బ్యాంకు ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన ఔట్ డోర్(ఓపెన్) జిమ్‌లకు ఆదరణలేక వెలవెలబోతున్నాయి. రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలు ఎక్కడికక్కడ మరమ్మతుకు గురవుతున్నాయి. కొన్ని పరికరాలు విరిగిపోగా మరికొన్ని విడిబాగాలు ఊడిపడి తుప్పు పడుతున్నాయి. కొందరు ఊడిపడిన పరికరాలు అపహరించి పాతఇనుప సామన్ల కింద అమ్ముకుంటున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

నిర్వహణ లోపం..

ఓపెన్ జిమ్‌లో ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాల నిర్వహణపై సరైన పర్యవేక్షణ లేకపోవడం, సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడంతో పరికరాలు ఎక్కడికక్కడ దెబ్బతిన్నాయి. దీంతో ప్రభుత్వం ఆశించిన లక్ష్యం నెరవేరక పోగా వ్యాయామం చేయాలనుకున్న వారు తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు. డబ్బులు పెట్టి ప్రైవేట్ జిమ్‌లకు వెళ్లలేని వారు, పిల్లలు, యువత, వృద్ధులు సైతం ఉదయం, సాయంత్రం వేళల్లో ఓపెన్ జిమ్‌లను వినియోగించుకుంటున్నారు. ఓపెన్‌జిమ్‌లను సంబంధిత మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం చేయడంతో మూన్నాళ్ల ముచ్చటగా మారాయని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఓపెన్ జిమ్‌లో చక్కటి పరికరాలు..

ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లో వ్యాయామం కోసం అత్యాధునిక పరికరాలను ఏర్పాటు చేసింది. ఎయిర్‌వాకర్, పుష్ చైర్, ఎయిర్ స్వింగ్, షోల్డర్ వీల్, లెగ్‌ప్రెస్,



ఓపెన్ జిమ్‌లో విరిగిపోయిన పరికరాలు

పుల్ చైర్, లెగ్ లిఫ్ట్, స్టాండింగ్ ట్విస్టర్, రోవర్, డబుల్‌క్రాస్ వాకర్, సిట్టింగ్ ట్విస్టర్, టైచీ స్పిన్నర్ వీల్, ఎల్లిప్టికల్ మిషన్, తదితర వ్యాయామ పరికరాలు ఉన్నాయి.

విరిగిన, ఊడిన పరికరాలు..

జడ్చర్లలోని పద్మావతి కాలనీలో 2018లో దాదాపు రూ.15లక్షల వ్యయంతో అహ్లాదకరమైన పార్కులో అత్యాధునిక వ్యాయామ పరికరాలతో ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేశారు. దీంతో పట్టణవాసులు ఈ జిమ్‌ను కొంత కాలం పాటు చక్కగా వినియోగించుకున్నారు. తదుపరి జిమ్ పర్యవేక్షణ, నిర్వహణ కొరవడడంతో వ్యాయామ పరికరాలు ఎక్కడికక్కడ దెబ్బతిని విరిగిపోవడం, విడిబాగాలు ఊపిడిపోవడంతో వ్యాయామం చేయడానికి పనికి రాకుండా పోయాయి.

పట్టించుకోవాలి..

శారీరక, మానసిక ఉల్లాసానికి చక్కగా ఉపయోగపడే ఓపెన్ జిమ్‌ల నిర్వహణను అధికారులు పట్టించుకోవాలని పట్టణ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. పరికరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, వ్యాయామానికి సంబంధించిన శిక్షకుడిని కూడా నియమించాలని కోరుతున్నారు.

మరమ్మతు చేయించాలి..



ఓపెన్ జిమ్ పరికరాలను మరమ్మతు చేయించి వినియోగానికి సిద్ధం చేయాలి. ఎప్పటికప్పుడు పరికరాలను పర్యవేక్షించే విధంగా చర్యలు చేపట్టాలి. అందుబాటులో ఓ శిక్షకుడిని ఏర్పాటు చేసేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఓపెన్ జిమ్‌ను అందరికి అందుబాటులో ఉంచే విధంగా కృషి చేయాలి.

– రాఘవేందర్, పద్మావతి కాలనీ, జడ్చర్ల

జిమ్ ఏర్పాటు తర్వాత నిర్లక్ష్యం..



ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేసిన తరువాత సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వదిలేశారు. దీంతో వ్యాయామ పరికరాలు దెబ్బతిన్నాయి. పరికరాలు బోల్టులు ఊడి పడిపోయాయి. కొన్ని విరిగిపోయాయి. కొన్ని విడిబాగాలు అపహరణకు గురయ్యాయి. దొంగలు చేతి వాటం చూపడంతో పార్కు సంరక్షణతో పాటు జిమ్ పరికరాల పరిరక్షణ చర్యలు చేపట్టాం. నిర్ణీత వేళలు ముగిసిన తరువాత పార్కులోకి వెళ్లకుండా గేటుకు తాళం వేస్తున్నాం. సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– ప్రశాంత్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్, జడ్చర్ల

చర్యలు చేపడుతాం..

పద్మావతి కాలనీలో ఓపెన్ జిమ్ పరికరాల నిర్వహణపై దృష్టి సా రిస్తాం. పాలక మండలి సమావేశంలో చర్చించి జిమ్ పరికరాల మరమ్మతు చేయించే విధంగా కృషి చేస్తాం. ప్రజలకు జిమ్ ఉపయోగపడే విధంగా కార్యాచరణను రూపొందించి ఆదిశగా కృషి చేస్తాం.

– లక్ష్మారెడ్డి, మున్సిపల్ కమిషనర్, జడ్చర్ల

క్లుప్తంగా

నైతిక విలువలు పెంచేది హరికథ



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: హరికథా గానం సాంస్కృతిక వారసత్వాన్ని, నైతిక విలువలను పెంపొందిస్తుందని రేడియో ఆర్టిస్ట్ గద్వాల కాశీవిశ్వనాథ్ అన్నారు. ఆదివారం స్థానిక తువ్వగుట్టలోని బసవ భవన్‌లో పట్టణ వీరశైవ సమాజం ఆధ్వర్యంలో మహాత్మా బసవేశ్వరుడి జీవిత చరిత్రను హరికథా రూపంలో గానం చేశారు. అంతకుముందు ఆయన మాట్లాడుతూ ఈ కళను అందరూ ప్రోత్సహించి కళాకారులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఆవిటి శంకర్‌లింగం, నాయకులు పోకల శివుడు, వజ్రలింగం, పి.నాగభూషణం, జాజిమి చంద్రశేఖర్, భద్రీనాథ్, పి.మల్లేష్, నాగేష్, రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయండి



హన్వాడ: లేబర్‌కోడ్‌లకు వ్యతిరేకంగా ఈనెల 9న దేశవ్యాప్తంగా చేపట్టబోయే సమ్మెను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి లక్ష్మయ్య పిలుపునిచ్చారు. ఆదివారం కరపత్రాన్ని విడుదల చేశారు. దేశవ్యాప్తంగా చేపట్టబోయే నిరసన కార్యక్రమంలో రైతులు, కూలీలు, ఉపాధ్యాయులు సన్నద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, వివిధ గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

గోశాలకు గోవుల తరలింపు

చిన్నచింతకుంట: మండలం అమ్మాపురం కురుమూర్తి స్వామికి భక్తులు కానుకలుగా సమర్పించిన 5 గోవులను ఆదివారం హనువాడ మండలం చిన్నదర్పల్లిలోని శ్రీలక్ష్మి గోశాలకు ఆటోలో తరలించారు. ఈ సందర్భంగా గోవుల సంరక్షణకే గోశాలకు తరలిస్తున్నట్లు ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈఓ మధనేశ్వర్‌రెడ్డిలు తెలిపారు.కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు ఉన్నారు.

బాదేపల్లి శతాబ్ది ఉత్సవ కమిటీ ఎన్నిక

జడ్చర్ల టౌన్: బాదేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాల నిర్వహణకోసం జంబో కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. పట్టణంలోని చంద్రాగార్డెన్‌లో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమావేశంలో ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడిగా స్థానిక శాసనసభ్యుడు అనిరుద్‌రెడ్డి, అధ్యక్షుడిగా బి.రవిశంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వి.కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా వెంకటరమణాచార్యులు, ఉపాధ్యక్షులుగా సయ్యద్‌ఇబ్రహీం, పెద్ది బాలకృష్ణ, ఆకుల వెంకటేశ్, అయూబ్, మౌనిక, రాజుగౌడ్, సంతోష్‌చారి, సత్యం జీనురాల, పరమటయ్య, ప్రకాశ్‌చారి, సుభాన్ అలి, వితా లసంతోష్‌కుమార్, టైటస్, ఇర్ఫాన్, సంయుక్త కార్యదర్శులుగా శ్రీహరి, రాఘవేందర్‌గౌడ్, అర్జున్, కార్యదర్శులుగా డా.రాఘవేందర్, మోయిజ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కంచుకోట ఆనంద్, కోశాధికారి మేడిశెట్టి రామకృష్ణలను ఎన్నుకున్నారు. కమిటీలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళ, ఎంఈఓ మంజులాదేవిలకు సముచిత స్థానం ఉంటుందని వర్కింగ్‌ప్రెసిడెంట్ వి.కృష్ణ తెలిపారు.

ఉప్పర సంఘం అధ్యక్షుడిగా మధుసాగర్

జడ్చర్ల టౌన్: ఉప్పరసంఘం జడ్చర్ల మండల అధ్యక్షుడిగా మధుసాగర్‌ను ఎన్నుకున్నారు. ఆదివారం పట్టణంలోని ప్రేరణ బ్రిలియంట్ స్కూల్‌లో నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన ఎన్నికను జిల్లా అధ్యక్షుడు ప్రణీల్‌చందర్ ప్రకటించారు. ప్రధానకార్యదర్శిగా వావిలాల శంకర్, కోశాధికారి చంద్రశేఖర్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి జిల్లా అధ్యక్షుడు ప్రణీల్ పలు సూచనలు చేశారు. ఎన్నికలో జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యం, పర్వతాలు, రవిసాగర్, బుడ్డన్న, చంద్రమోహన్, ప్రశాంత్‌లు పాల్గొన్నారు.

విజయోత్సవానికి తరలిన నాయకులు



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఏపీలోని ప్రకాశం జిల్లా ఈదుమూడిలో ఈనెల 7న నిర్వహించే ఎస్సీల వర్గీకరణ జాతీయ స్థాయి విజయోత్సవ సభకు జిల్లాకు చెందిన ఎంఆర్‌పీఎస్–ఆర్‌ఆర్ నాయకులు ఆదివారం బయలుదేరారు. అంతకుముందు స్థానిక తెలంగాణచౌరస్తాలోని బాబు జగ్జీవన్‌రాం, కొత్త బస్టాండు ఎదుట ఉన్న అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాయికంటి రాందాస్, సింగిరెడ్డి పరమేశ్వర్, ఎల్.రమేష్, తిర్మలయ్య, రాములు, వినోద్‌కుమార్, పెద్ద బాలయ్య పాల్గొన్నారు.

ఘనంగా మొహర్రం పండుగ



మహబూబ్‌నగర్‌లో పీర్ల ఊరేగింపు

స్టేషన్ మహబూబ్‌నగర్: హిందూ, ముస్లింల సమైక్యతకు ఆలవాలమైన పీర్ల పండుగ జిల్లాలో పది రోజుల నుంచి నిర్వహించారు. షహదత్ రోజైన ఆదివారం పీర్లను ఊరేగించారు. జిల్లా కేంద్రంలోని పాత పాలమూరు, వీరన్నపేట, టీడీ గుట్ట, రామయ్యబౌలీ తదితర ప్రాంతాల్లో పీర్ల పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. పట్టణంలోని ప్రధానవీధుల్లో భక్తిశ్రద్ధలతో పీర్లను ఊరేగించారు. జిల్లా కేంద్రంతోపాటు పలు పట్టణాల్లో పలువురు ముస్లిం సోదరులు షర్బత్(బెల్లం లేదా పాలతో చేసిన పానకం) పంపిణీ చేశారు.

మొహర్రం పాల షర్బత్ పంపిణీ

భూత్పూర్: పట్టణంలోని బీసీ కాలనీలో మొహర్రం సందర్భంగా పాల షర్బత్‌ను ముస్లింలు పంపిణీ చేశారు. మొహర్రం (పీర్ల పండుగ) రోజు హజ్రత్ హుస్సేన్, హుస్సేన్ వారి జ్ఞాపకార్థం పట్టణంలో వాహనదారులు, పాదచారులు, ప్రయాణికులకు పాల షర్బత్‌ను పట్టణ ముస్లిం నేత మహ్మద్ సాదిక్,, మహ్మద్ రహమతుల్లా, మహ్మద్ సుబాన్, మహ్మద్ మస్తాన్, ముస్తాఫా పంపిణీ చేశారు.

హన్వాడ: మండలంలోని నాగినోనిపల్లి, వేపూర్, గొండ్యాల్, చిన్నదర్పల్లి, హన్వాడ, తిర్మలగిరి, టంకర, గుడ్డిమల్కాపూర్, బుద్దారం గ్రామాల్లోని చావిడీల్లో కొలువైన పీర్లను మతాలకతీతంగా ప్రజలు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పీర్లు ఆయా గ్రామాల పురవీధుల గుండా తిరిగి భక్తులకు దర్శనమిచ్చాయి. ఉత్సవాల్లో చివరిరోజు ఆదివారం పీర్లు భక్తులకు దర్శనమిచ్చి గ్రామశివారులోని బావిలో నిమజ్జనం చేశారు.

మిడ్జిల్: కుల, మతాలకు అతీతంగా నిర్వహించే మొహర్రం వేడుకలను ఆదివారం మండల కేంద్రంతో పాటుగా వాడ్యాల్, బోయిన్‌పల్లి, కొత్తూర్, మున్ననూర్, వేముల, బైరంపల్లి, రాణిపేట్, గ్రామాలలో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి గ్రామాలలో పీర్లను ఊరేగింపు నిర్వహించారు. మొహర్రంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జడ్చర్ల సీఐ నాగార్జునగౌడ్, ఎస్‌ఐ శివనాగేశ్వర్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు చేపట్టారు.



భూత్పూర్‌లో పాలషర్బత్‌ను పంపిణీ చేస్తున్న ముస్లింలు



మిడ్జిల్‌లో మొహర్రం వేడుకలలో బొడ్డెమ్మ వేస్తున్న మహిళలు



పాతపాలమూరులో పీర్ల ఊరేగింపు


నవాబుపేట: మండలంలో మొహర్రం పండగ కూచూర్, చౌడూర్, రంగంపల్లి, కాకర్‌జాల్, కొల్లూర్, నవాబుపేట, మరికల్, లోకిరేవు, యన్మన్‌గండ్ల, చాకలపల్లి గ్రామాల్లో పీర్ల ఊరేగింపులు నిర్వహించారు. అలై అడుతూ పాటలు పాడుతూ పండగను వైభవంగా జరుపుకున్నారు.

శామాప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి

గండేడ్: జనసంఘ వ్యవస్థాపకుడు గొప్ప జాతీయవాది, విద్యావేత్త శామాప్రసాద్ ముఖర్జి మహోన్నత వ్యక్తి అని మండల విశ్వ హిందు పరిషత్ అధ్యక్షుడు గిరమోరి ఆంజిలయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డిలు పేర్కొన్నారు. మండలంలోని సల్కర్‌పేటలో ఆయన చిత్ర పటానికి పులమాలలు వేసి నివాళులర్పించారు.

నవాబుపేట: మండల కేంద్రంలో శామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల కార్యదర్శి గణేష్‌చారి, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

మిడ్జిల్: శామాప్రసాద్ ముఖర్జీ జయంతిని మండల కేంద్రంలో బీజేపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, మండల అధ్యక్షులు నరేష్‌నాయక్, నరేందర్, అంజి ,ప్రశాంత్, విష్ణు, శివ,వంశి, తదితరులు పాల్గొన్నారు.



సల్కర్‌పేట్‌లో శామాప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళులర్పిస్తున్న నాయకులు

హన్వాడ: శామాప్రసాద్ ముఖర్జి చిత్రపటానికి బీజేపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో లింగం, వెంకటయ్య, కొండ బుచ్చిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కరించండి



దేవరకద్ర: దేవరకద్ర నియోజకవర్గంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఈఆర్‌సీ చైర్మన్ నాగార్జునను కోరారు. ఆదివారం హైదరాబాద్‌లో ఎలక్ట్రిసిటీ కమిషన్ చైర్మన్ నాగార్జునను ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నియోజకవర్గంలోని విద్యుత్ సమస్యలపై చైర్మన్‌తో చర్చించారు. ఈఆర్‌సీ చైర్మన్ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

శాకాంబరిమాతగా మైసమ్మ అలంకరణ

జడ్చర్ల టౌన్: 44వ నంబరు జాతీయ రహదారిపై కావేరమ్మపేట వద్ద ఉన్న బంగారు మైసమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారిని శాకాంబరి మాతగా కూరగాయలతో అలంకరించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'గోరింటాకుతో ఎన్నో ప్రయోజనాలు'



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: గోరింటాకుతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని పట్టణ వీరశైవ సమాజం మహిళా నాయకురాళ్లు ఆవిటి ప్రశాంతి, సుమిత్రాశెట్టి, పోకల భార్గవి అన్నారు. ఆదివారం స్థానిక తువ్వగుట్టలోని బసవ భవన్‌లో గోరింటాకు మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీనిని చేతులకు పెట్టుకోవడం వల్ల ఉష్ణాన్ని లాగేసి చలువ చేస్తుందన్నారు. ఆకు రసం నాడుల ద్వారా గర్భాశయానికి చేరి దోషాలు తొలగి ఆరోగ్యంగా ఉంచుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జాజిమి హని, కాత్యాయని, గౌరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ దర్శనానికి భక్తుల క్యూ

నవాబుపేట: మైసమ్మ దేవత నామస్మరణతో అడవి మొత్తం మార్మోగింది. ఆదివారం మండలంలోని మైసమ్మ దేవాలయంలో జనం తండోపతండాలుగా వచ్చి అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూ కట్టారు. సెలవు రోజు కావటంతో అడవిలో చెట్ల కింద సేదతీరి అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని విందుభోజనం చేశారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి

అడ్డాకుల: కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ పటిష్టతకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కారెడ్డి నాగిరెడ్డి అన్నారు. మండలంలోని చిన్నమునుగల్‌ఛేడ్, పెద్ద మునుగల్‌ఛేడ్‌లో సమావేశాలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి



పిల్లలమర్రి రోడ్డులోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బారులు తీరిన భక్తులు



కందూర్ రామలింగేశ్వరాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆషాఢ శుద్ధ ఏకాదశి(తొలి ఏకాదశి) వేడుకలను జిల్లా కేంద్రంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచి ఉపవాసాలు, ఏకాదశి దీక్షలు చేపట్టి భక్తితో తరించారు. పర్వదినం సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక విశేష అర్చనలు, పూజలు చేశారు. స్థానిక పిల్లలమర్రి రోడ్డులోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఉదయం స్వామివారికి తోమాలసేవ, సహస్ర నామార్చన, తులసీ అర్చనలు, విష్ణు సహస్ర పారాయణం, వేద పారాయణాలు నిర్వహించారు. సింహగిరిలోని లక్ష్మీ నరసింహ్మస్వామి దేవాలయంలో ఏకాదశి సందర్భంగా ఉదయం నుంచి పూజలు నిర్వహించారు. బస్టాండ్ ఎదురుగా రేణుకా ఎల్లమ్మ గుడి, పాత శివాలయంలో, టీచర్స్ కాలనీలోని రామాలయం, శ్రీనివాస కాలనీలోని శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయ సముదాయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అడ్డాకుల: మండలంలోని కందూర్ సమీపంలో శ్రీరామలింగేశ్వరాలయంలో తొలి ఏకాదశి సందర్భంగా భక్తులు పూజలు చేశారు. సాయిబాబా ఆలయం ఆలయం, మూసాపేట మండలం పొల్కంపల్లి శివాలయంలో భక్తులు పూజలు చేశారు.

దేవరకద్ర: మండల కేంద్రంలోని ఈశ్వర వీరప్పయ్యస్వామి దేవాలయంలో అఖండ భజనలు ప్రారంభించారు. రాత్రి 7 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు భజనలు నిర్వహిస్తారు. చిన్నరాజమూర్ ఆంజనేయస్వామి దేవాలయంలో పంచామృతాభిషేకం నిర్వహించి స్వామి వారి నిజరూప దర్శనం కల్పించారు.

జడ్చర్ల టౌన్: ఆషాడశుద్ధ ఏకాదశి పురస్కరించుకుని మండలంలోని వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజామునుంచే భక్తుల రద్దీ నెలకొంది. స్వామి దర్శనం చేసుకునేందుకు భక్తులు బారులు తీరారు. గంగాపురం లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో లక్షపుష్పార్చన నిర్వహించారు. కుంకుమార్చన చేసి భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు. రమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయం, వాసవికన్యకాపరమేశ్వరి ఆలయం, నెక్కొండ స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయాలకు సైతం భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి దర్శనం చేసుకున్నారు.

దేవరకద్ర రూరల్: వెంకటాయపల్లి గ్రామ ప్రజలు గ్రామ సమీపంలోని ఊరగుట్టపై వెలిసిన శ్రీరంగ నాయక స్వామి ఆలయంలో ప్రత్యేక పూజాలను ఘనంగా నిర్వహించారు.

వైభవంగా చిన్మయ్యస్వామి ఉత్సవాలు

నవాబుపేట: మండలంలోని కొల్లూర్‌లో ఏకదశి ఉత్సవాలు రెండోరోజు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా పీఠాధిపతి నందీశ్వరస్వామి ఆధ్వర్యంలో భక్తులు ఉపవాస దీక్షలు చేసి స్వామి మఠంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేసి ఉపవాసాలు విరమించారు. కొల్లూర్ చిన్మయ్యస్వామి మఠంలో ఏకదశి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.



జడ్చర్లలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో కలశంతో భక్తులు

పోరాటాల యోధుడు పండగ సాయన్న

నవాబుపేట: నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేస్తూనే పేదల పాలిట ఆపద్బాంధవుడిగా పేరుగాంచిన తెలంగాణ రాబిన్‌హుడ్ పండగ సాయన్న జయంతిని అధికారికంగా నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ముదిరాజ్ మహాసభ నాయకులు సహకార సంఘం చైర్మన్ నర్సింహులు, మార్కెట్ కమిటీ చైర్మన్ లింగం తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో మండలానికి చెందిన పండగ సాయన్న జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జనం కరువుతో విలవిలలాడుతూ చనిపోతున్న తరుణంలో పేదల ఆకలి తీర్చిన యోధుడు మన ప్రాంతానికి చెందిన వాడు కావటం గర్వంగా ఉందన్నారు. ఆయన చరిత్ర మనందరికి ఆదర్శం కావాలన్నారు. అందుకే ఆయన జయంతి అధికారికంగా నిర్వహించాలని, పండగ సాయన్న ధైర్యసహసాలు ప్రజలు వివరించేలా చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాంమనోహర్‌రాజు, బ్యాంగి రవీందర్, రాజేష్, సత్యం, కుమార్, అంజయ్య, ఆనంద్, నర్సింహ, వెంకటయ్య, కృష్ణ పాల్గొన్నారు.



నవాబుపేటలో పండగ సాయన్న చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

బాబు జగ్జీవన్‌రాం సేవలు ఎనలేనివి



జగ్జీవన్‌రాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చైర్మన్లు, నాయకులు



జడ్చర్లలో జగ్జీవన్‌రాంకు నివాళులర్పిస్తున్న నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: దేశానికి బాబు జగ్జీవన్‌రాం చేసిన సేవలు ఎనలేనివని ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ అన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఉప ప్రధానమంత్రి బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, డీసీసీ మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్, నాయకులు సుధాకర్‌రెడ్డి, ధర్మాపురం నర్సింహారెడ్డి, గోవింద్ యాదవ్, మహ్మద్ ఖాజా, రాంచందర్, రాజు గౌడ్, యాదయ్య, రంగయ్య, శ్రీనివాస్‌రెడ్డి, అజీజ్, అలీ తదితరులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: మండల కేంద్రంలో బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శాంతిబాయి, ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకుడు అనంతయ్య గుప్త, బీసీ మండల నాయకుడు వేణుగౌడ్, జనార్దన్, చంద్రారెడ్డి గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: బాబు జగ్జీవన్‌రామ్ 39వ వర్ధంతిని పురస్కరించుకుని మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఆయన విగ్రహం వద్ద పలువురు ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు భీంరాజ్ నేతృత్వంలో బీసీ జాగృతిసేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్, సీపీఎం నాయకులు తెలుగు సత్తయ్య, సీఐటీయూ నాయకులు దీప్లానాయక్, నిరంజన్, రంగయ్య, శివశంకర్, గోనెల రాధాకృష్ణలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ కోడ్గల్ యాదయ్య, నాయకులు రఘుపతిరెడ్డి, కౌన్సిలర్ రఘురాంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మహమ్మదాబాద్‌లో..

కృతజ్ఞతభావం కలిగి ఉండాలి

హన్వాడ: ప్రతి ఒక్కరు కృతజ్ఞతభావం కలిగి ఉండాలని సీనియర్ పిరమిడ్ మాస్టర్ పాండురంగం అన్నారు. ఆదివారం మండలంలోని దాచక్‌పల్లిలో నిర్వహించిన ధ్యాన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. చిన్నప్పటి నుంచే పిల్లలకు ధ్యాన సాధన చేయించాలన్నారు. ధ్యానంతో క్రమశిక్షణ అలవడటంతో పాటు ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని పేర్కొన్నారు. మానవాళి మను గడకు ప్రకృతి ఎంతో దోహదం చేస్తుందని ప్రతిరోజు కృతజ్ఞతగా ఉండాలని సూచించారు. చిరాకు, కోపం, ఈర్ష్య ద్వేషాలు దూరం అవుతాయన్నారు. సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని దీర్ఘ కాలిక రోగాలు కూడా నయం చేసుకోవచ్చన్నారు. అనంతరం పీఎస్ ఎస్ఎం జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు మాట్లాడుతూ మాంసాహారంతో రుగ్మతలు వస్తా యని, అహింసా మార్గమే ఉత్తమమైనది వివరించారు. పీసీఎంఎస్ కంపెనీ ఎండీ నరేందర్, రాము, శ్రీను, సతీష్ కుమార్, పులి సత్యనారాయణరాజు, భారతి, రామస్వామి, మార్కెట్ శ్రీను పాల్గొన్నారు.



ధ్యానులతో పిరమిడ్ మాస్టర్ పాండురంగం